క్లుప్తంగా

16న ఒంగోలు మండల పరిషత్ సమావేశం

ఒంగోలు రూరల్: ఒంగోలు మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 16వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఒంగోలులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.అజిత తెలిపారు. ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించనున్న ఈ సమావేశానికి 36 శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే టీజేఆర్ పరామర్శ



రమణమ్మను ఓదారుస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ నాయకురాలు సన్నపురెడ్డి రమణమ్మ మనుమడు డాకా రాజశేఖరరెడ్డి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు బుధవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్ సుశీల

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం పీ తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మన్నేపల్లి శ్రీనివాసులు బేల్దారి పనులకు వెళ్లి మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు మృతుడి కుమార్తెకు స్థానిక సర్పంచ్ ఆలూరి సుశీల చేతుల మీదుగా రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ఆలూరి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేవీవీ అధ్యక్షునిగా నల్లూరి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక చీమకుర్తి మండల శాఖ అధ్యక్షునిగా నల్లూరి వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. బుధవారం చీమకుర్తిలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన నూతన శాఖ ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధాన కార్యదర్శిగా చలువాది రమేష్, గౌరవాధ్యక్షునిగా అంబటి వీరారెడ్డి, కోశాధికారిగా బీ ఆంజనేయులు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ హాజరవగా, సుబ్రహ్మణ్యాచారి. పీవీ కోటేశ్వరరావు, హరిప్రసాద్, శిలార్‌సాహెబ్ పాల్గొన్నారు.

'మేరా మట్టి-మేరా దేశ్'ను విజయవంతం చేయాలి



మొక్కలు నాటి నీళ్లుపోస్తున్న ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, మేయర్ గంగాడ సుజాత



యరజర్లలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో అజిత



సీతారాంపురం కొష్టాల సెంటర్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పీడీ శీనారెడ్డి



వినోదరాయునిపాలెంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి

- ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు

ఒంగోలు సబర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక 18వ డివిజన్ వెంగముక్కపాలెంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాకుమారి మాట్లాడుతూ అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నినాదంతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, తిరుమల రెడ్డి, కురుగుంట ఏడుకొండలు, నిరూప్ కుమార్, అశోక్, చింటు, మురళి, క్విస్ కాలేజీ ఎన్ఎస్ఎస్ టీం విద్యార్థులు పాల్గొన్నారు.

పేస్ కాలేజీలో...

ఒంగోలు సిటీ: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ్, ఎస్టీఈసీ మేనేజరు శ్రీమన్నారాయణ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీధర్, ప్రిన్సిపాల్ జీ.వి.కె.మూర్తి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.రమణబాబు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా.ఆర్.వీరాంజనేయులు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మల్లికార్జునరావు, బి.సురేష్‌బాబు, బి.వంశీకృష్ణ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కాలేజీలో...

ఎస్వైకే–ప్రకాశం, జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్ ఆదేశాల మేరకు స్థానిక క్విస్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అండ్ ఎన్‌వైకే విభాగాల వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. క్విస్ రోట్రాక్టు క్లబ్ సౌజన్యంతో దత్తత గ్రామాలైన చెరువుకొమ్ముపాలెం, యరజర్ల, కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ ఎన్.సూర్యకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

యరజర్లలో...

ఒంగోలు రూరల్: మండలంలోని యరజర్ల సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో అజిత పాల్గొని మాట్లాడారు. మాతృదేశంలో మట్టి అందరినీ ఏకం చేస్తుందన్నారు. మాతృభూమికి నివాళి ఇవ్వాలన్నారు. అన్ని గ్రామాల నుంచి మట్టి సేకరించి ఢిల్లీ పంపాలన్నారు. పంచాయతీలో దేశం కోసం పోరాడిన వారి శిలాఫలకాలు ఏర్పాటు చేయాలన్నారు. శిలాఫలకం వద్ద సెల్ఫీ తీసుకోవాలన్నారు. భూమికి వందనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామకృష్ణ, సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ, మండల పశువైద్యాధికారి భూపాల్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, ఏపీఎం గోపీనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ వాలి, వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మిశెట్టి శ్రీనివాసరావు, జాజుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ హరి, పందిరి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ రాధా పండేలా పాల్గొన్నారు.

సీతారాంపురం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన డ్వామా పీడీ...

మద్దిపాడు: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా మండలంలోని సీతారాంపురం కొష్టాల సెంటర్ వద్ద జూలై 29వ తేదీ మొక్కలు నాటిన పీడీ శీనారెడ్డి.. బుధవారం ప్రధాని మోదీ, సీఎం జగన్ ఆదేశానుసారం నాభూమి నాదేశం, నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆయన వెంట ఏపీడీ వెంకటస్వామి, ఏపీఓ ధనంజయ, ఏఈ కిషోర్‌కుమార్, పలువురు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినోదరాయునిపాలెంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శిలాఫలకం వద్ద ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి సెల్ఫీ దిగారు. అనంతరం మొక్కలు నాటి దేశ ఔన్నత్యాన్ని, ఐక్యతను చాటేలా గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్, ఏపీవో రవిబాబు, పోలినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ పాద పవన్, మద్దిసాని నాగేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల తనిఖీ

- ఐదు ప్రైవేటు పాఠశాలలకు అనుమతి లేదని గుర్తింపు
- నోటీసులిచ్చి నిలుపుదల చేయించాలన్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి



పాఠశాలను తనిఖీ చేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

కొత్తపట్నం: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మండలంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ వనరుల కేంద్రం, శ్రీవాణి విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్లో 1,200 మంది విద్యార్థులు చదువుతుంటే కేవలం 400 మందే మధ్యాహ్న భోజనం తినడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన శాతం పెంచాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని తినే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాలలో తాగు నీరు లేవని, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉందని, మరుగుదొడ్లు సరిగా లేవని మండిపడ్డారు. డ్రాపౌట్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలను తనిఖీ చేశారు. పర్మిషన్ అయిపోయి ఏడాదైనా పాఠశాల ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించారు. తరగతి గదులన్నీ తిరిగి వివరాలడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లకు డోర్లు కూడా సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. చైల్డ్‌లైన్ కంప్లెంట్ బాక్సులు కూడా లేవని మండిపడ్డారు. అప్పటికప్పుడే బాక్సులు పెట్టించారు. అనంతరం కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి రికార్డులు, గదులను తనిఖీ చేశారు. విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు. అల్లూరు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీలో పిల్లల బరువు తక్కువగా ఉండటంపై ప్రశ్నించారు. మండలంలో ఐదు ప్రైవేటు పాఠశాలలకు అనుమతి లేదని, నోటీసులిచ్చి నిలుపుదల చేయించాలని ఎంఈవో తులసీకుమారిని ఆదేశించారు. కార్యక్రమంలో విశ్వయాల సంక్షేమ సంఘ ఫౌండర్ మస్తాన్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ, సీఆర్పీ శ్రీను, పాఠశాల హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, చాపల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రాకు అదనపు ఆహారధాన్యాల సరఫరాపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఆంధ్రాకు అదనపు ఆహార ధాన్యాల సరఫరాపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ సహాయక మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి సమాధానమిచ్చారు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 కింద రాష్ట్రాలు పంపిన లబ్ధిదారుల గుర్తింపు నివేదికల ఆధారంగా దేశంలో రాష్ట్రాలకు ఆహార ధాన్యాల కేటాయింపు జరుగుతోందన్నారు. గృహ వినియోగ వ్యయ సర్వే 2011–12 ఆహార అర్హతను బట్టి అంత్యోదయ అన్న యోజన పథకం కింద నెలకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున ఒక కుటుంబానికి 35 కేజీలు గరిష్ఠంగా అన్ని రాష్ట్రాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 268.23 లక్షల మంది లబ్ధిదారులను నిర్ణయించడం జరిగిందని, రాష్ట్రాలు పంపే నివేదికల ప్రకారం లబ్ధిదారుల సంఖ్య అనేది పలు కారణాల వల్ల తగ్గడం లేదా పెరగడం జరుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నెలకు 1,55,987 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు చట్టం పరిధిలో గరిష్ఠంగా కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద 2023 జనవరి నుంచి అన్ని రాష్ట్రాల్లోని ఏఏవై గృహాలకు, పీహెచ్‌హెచ్ లబ్ధిదారులకు ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆహార ధాన్యాలు ఉచితంగా అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని 50వ డివిజన్ పరిధిలో గల నేతాజీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం భూమి పూజ చేశారు. రూ.65 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు వలన ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదు, ఎంఈ కే మాల్యాద్రి, డీఈ సవరం గణపతి, వైఎస్సార్ సీపీ నాయకులు జెల్లిపల్లి సురేష్, ఏడుకొండలు, కండే రాములు, స్థానికులు పాల్గొన్నారు.

పొగనారు రైతులకు రసీదులివ్వాలి



నారును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్

మద్దిపాడు: పొగనారు కొనుగోలు చేసే రైతులకు నర్సరీల యాజమాన్యం తప్పనిసరిగా రసీదులివ్వాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి వైఎంఎస్‌వీఎస్ గోపీచంద్ అన్నారు. మండలంలోని కొలచనకోట గ్రామ సమీపంలో ఉన్న నర్సరీని బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల యజమానులు నర్సరీ రిజిస్ట్రేషన్ యాక్ట్ 2010 కింద నమోదు చేసుకోవాలని, అలా చేయని నర్సరీల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీలు నిర్వహించే వారు తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలని, నారు పద్ధతులు కూడా రికార్డులలో నమోదు చేయాలని అన్నారు. రికార్డులు నిర్వహించని వారికి నోటీసులు ఇస్తామన్నారు. రైతులకు నాణ్యమైన నారు అందించాలన్నారు. నర్సరీల పేర్లు కనిపించేలా సూచికలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఒంగోలు డివిజన్ హార్టీకల్చర్ అధికారిణి ప్రత్యూష, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

ఫొటో కంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



ఫొటో కంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 19వ తేదీ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కళానిలయం ఆధ్వర్యంలో క్విస్ ఇంజినీరింగ్ కాలేజ్, బీఎంఆర్ గోల్డ్ అండ్ డైమండ్ ఫోరూం సహకారంతో ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫోటో కంటెస్ట్ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ దినేష్ కుమార్ బుధవారం ప్రకాశం భవనంలో ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్స్ ప్రతిభ నిరూపించుకునేందుకు ఇదో వేదిక కావాలని ఆకాంక్షించారు. డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, సాంఘీక సంక్షేమాధికారి లక్ష్మానాయక్, వికలాంగుల శాఖ ఏడీ అర్చన, నిర్వాహకులు అంగలకుర్తి ప్రసాద్, అజయ్‌బాబు, వేలూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ కార్యక్రమం



పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ రమేష్, రైతులు

మద్దిపాడు: మండలంలోని నందిపాడు గ్రామంలో వరి సాగుచేస్తున్న రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి కే రమేష్ పొలం బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమాన్ని 14 వారాల పాటు విత్తనం వేసిన దగ్గర నుంచి పంట కోత వరకూ నిర్వహిస్తామన్నారు. పురుగు మందులు ఎక్కువగా వాడటం వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. ముందుగా వీఏఏ ద్వారా పొలంలో మట్టి నమూనాలు సేకరించారు. అనంతరం విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు చూపించారు. విత్తనం మొలక శాతాన్ని ఏ విధంగా చూడాలన్న అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శేషయ్య, వీఏఏ స్వాతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీదారులను తరిమికొట్టాలి

ఒంగోలు టౌన్: దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ దోపిడీదారులను దేశం నుంచి తరిమికొట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద మోదీ హఠావో దేశ్‌కు బచావో, క్విట్ కార్పొరేట్, క్విట్ అగ్రికల్చర్ నినాదంతో ధర్నా నిర్వహించారు.

పాడి రైతులకు అధిక ధరలు

రంగాయపాలెం (కొత్తపట్నం): జగనన్న పాల వెల్లువలో పాలు పోసే పాడి రైతులకు అధిక ధరలు ఇస్తున్నారని పశువైద్యశాఖ జేడీ బేబీరాణి అన్నారు. జగనన్న పాల వెల్లువపై మండలంలోని రంగాయపాలెం తుఫాన్ షల్టర్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ గాలి స్వరూప అధ్యక్షత వహించగా, బేబీరాణి మాట్లాడుతూ ప్రస్తుతం ఏఎంసీయూలో గేదె పాలు ఒక లీటరు పోస్తే రూ.58 నుంచి రూ.88కి పెంచడం జరిగిందన్నారు. 200 లీటర్లు పాలు దాటితే అదనంగా ప్రతి లీటర్‌కు రూ.2.25 వస్తుందన్నారు. ప్రస్తుతం 1,100 లీటర్ల పాలుపోస్తున్నారని, దానిని 1,500 లీటర్లకు పెంచాలని కోరారు. ఏఎంసీలో అత్యధిక పాలు పోసే పాలేటి శ్రీదేవి, కిష్టం ధనలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశా, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పంచాయతీ కార్యదర్శి హుస్సారా బేగం, వెంకట్రావు, అమూల్ సూపర్‌వైజర్ వినోద్, సీసీ అరుణ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, పాల రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీ పాలకులను తరిమికొడదాం

ఒంగోలు టౌన్: క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశంలోని మతోన్మాద బీజేపీ పాలకులను తరిమికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కారదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ముందు కేవీపీఎస్, వ్యకాసం ఆధ్వర్యంలో క్విట్ కులవివక్ష, క్విట్ మతోన్మాద అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



ఉలిచిలో జీవామృతం తయారు చేస్తున్న రాధా శింగమనేని

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలు సంవత్సరం పొడవునా ఆదాయం, ఆరోగ్యం ఇస్తాయని రైతు సాధికారిక సంస్థ ప్రతినిధి రాధా శింగమనేని అన్నారు. మండలంలోని ఉలిచి గ్రామంలో సంవత్సరం పొడవునా ఆకుకూరలు, కూరగాయలు పండించేందుకు కావాల్సిన అవగాహనపై సాంకేతిక ఆలోచనలు కార్యక్రమాన్ని బుధవారం ఆమె నిర్వహించారు. 30 రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలతో ఏటీఎం మోడల్ చేశారు. అనంతపురం నుంచి వచ్చిన ప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జ్ రాధా, మోడల్ మేకర్ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవామృతం తయారీ విధానం, ఉపయోగాల గురించి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో చిరంజీవి, నాంచార్ రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.